సామాన్యుడి ఆయుధం

# ప్రజల అస్త్రం

T/AP/2024/0304/1072/41

తెలుగు దినపత్రిక

ANDHRA PRADESH

prajalaastram999@gmail.com

ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ సంపుటి: 1 సంచిక: 298 పేజీలు: 6 బుధవారం 12 -3-2025 వెల: 5/రూ -

విలేకరులు కావలెను..

అస్త్రం తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్స్, నియోజకవర్గ ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు కావలెను.. సీనియర్ రిపోర్టర్స్ కి ప్రాధాన్యత ఇవ్వబడును.. మరిన్ని వివరాలకు సంప్రదించండి.

ఎడిటర్, 89193 45606

## రౌడీలు, ఫ్యాక్షనిస్టులు అనే మాటే వినబడకూడదు

### శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించం: సీఎం


- ఆడబిడ్డల జోలికొస్తే అదే చివరి రోజవుతుంది
- మహిళలకు రక్షణగా 'శక్తి' యాప్ ప్రారంభించాం
- గంజాయి, డ్రగ్స్‌పై 'ఈగల్' యుద్ధం ఆపేది లేదు
- నేరస్థులకు కూటమి ప్రభుత్వం సింహస్వప్నమే
- శాసనసభలో సీఎం చంద్రబాబు హెచ్చరికలు



అమరావతి, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణలో గత ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రజలు స్వేచ్ఛగా తిరగలేని పరిస్థితులు తలెత్తాయని, ప్రభుత్వ ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని చెప్పారు. మంగళవారం శాసనసభలో శాంతిభద్రతల అంశంపై ఆయన మాట్లాడారు. ప్రజలు భయం లేకుండా సంతోషంగా జీవించాలంటే శాంతిభద్రతలను కాపాడటం చాలా ముఖ్యమని తెలిపారు. తమ ప్రభుత్వంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, తప్పు చేసినవారి తీట

- మిగతా 2వ పేజీలో

## భారత్‌కు, గ్లోబల్ సౌత్‌కు మధ్య ఒక వంతెన



- భారతదేశ కుటుంబంలో ఒక అంతర్భాగం
- ప్రవాస భారతీయుల సమావేశంలోధ ప్రధానమంత్రి మోదీ స్పష్టీకరణ
- మోదీ రెండు రోజుల మారిషస్ పర్యటన ప్రారంభం
- మోదీకి ఘన స్వాగతం పలికిన మారిషస్ ప్రభుత్వం
- తరలివచ్చిన ప్రధానమంత్రి, మంత్రివర్గం

మిగతా 2లో



## అరవింద్ కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ

### పాత కేసులో ఎఫ్ఐఆర్ నమోదుకు కోర్టు అనుమతి

ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ కు ఎదురుదెబ్బ తగిలింది. కేజీవ్రాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ 2019లో దాఖలైన పిటిషన్‌పై విచారణకు రౌస్ అవెన్యూ కోర్టు అనుమతించింది. మార్చి 18వ తేదీలోగా కేజీవ్రాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీ పోలీసులను

2లో

## గ్రూప్-2 పరీక్షా ఫలితాలు విడుదల



## స్వయం ఉపాధికి రూ.6 వేల కోట్లు

- మార్చి 15న నోటిఫికేషన్...
- అదే రోజు నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవంసందర్భంగా మంజూరు పత్రాలు
- రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల మందికిప్రయోజనం..
- చాకలి ఐలమ్మ వర్సిటీకి తక్షణమే రూ.115 కోట్లు



హైదరాబాద్: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగులకు స్వయం ఉపాధి కోసం ప్రత్యేక పథకాన్ని అమల్లోకి తేనున్నట్టు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. రాజీవ్ యువ వికాసం పేరుతో అమలు చేయనున్న ఈ పథకం కోసం రూ.6వేల కోట్లు కేటాయిస్తామని, రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగులకు ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. మంగళవారం

మిగతా 2లో



## కాంగ్రెస్ ప్రభుత్వానిది దివాలాకోరుతనం

### రూ.1.5 లక్షల కోట్లు కావాలని కేంద్రానికి లేఖ రాయడం చిన్నపిల్లల నవ్వులాటలా ఉంది

### నన్ను ఎవరు తిట్టినా వారి విజ్ఞతకే వదిలేశాను : కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, మార్చి: తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాన చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ

2లో

## రైతాంగ సమస్యలే కేంద్రంగా నిలదీయాలి



- సీఎం రేవంత్, మంత్రి వర్గం పనితీరు గుడ్డెద్దు చేలో పడినట్లు ఉంది
- బీఆర్ఎస్ శాసనసభాపక్ష భేటీలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యాఖ్య
- పార్టీ సీనియర్ సభ్యులు 'షాడో కేబినెట్'లా వ్యవహరించాలి
- గత ఏడాది కాలంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుదేలైంది
- ప్రభుత్వ అప్పులు, బడ్జెట్ లెక్కలపై అధ్యయనం చేయాలి
- ప్రతి అంశంపై ఆధారాలతో ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలి
- బీఆర్ఎస్‌పై నిందలను బలంగా తిప్పికొట్టాలని దిశానిర్దేశం

హైదరాబాద్: "ముఖ్యమంత్రికి అనుభవం, జ్ఞానం లేకున్నా కనీసం కామన్ సెన్స్‌ను కూడా ఉపయోగించడం లేదు. సీఎంకు అనుభవం లేని సందర్భంలో మంత్రివర్గంలో ఒకరిద్దరు అనుభవజ్ఞులు దిశానిర్దేశం చేసి ప్రభుత్వాన్ని నడుపుతారు. కానీ రాష్ట్రంలో సీఎం, మంత్రివర్గం పనితీరు గుడ్డెద్దు చేలో పడినట్లుగా ఉంది. హామీలు, పథకాల అమలును పక్కనపెడితే ప్రజల కనీస అవసరాలైన సాగు, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటివి కూడా అందించలేకపోతున్నారు. రేవంత్ ప్రభుత్వం కేవలం ఏడాదిలోనే తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంది. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకుని

2లో



## 15న తణుకులో 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'

విశాఖపట్నం, ఈ ఏడాది అక్టోబరు రెండో తేదీ నాటికి డంపింగ్ యార్డు రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దడమే లక్ష్యమని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. మంగళవారం జీవీఎంసీ అధికారులు, కార్పొరేటర్లతో పట్టాభిరామ్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో చెత్త, పారిశుధ్య నిర్వహణ, నీటి సరఫరా, యూసీడీ విభాగాల ద్వారా అందుతున్న సేవలు, కార్యక్రమాలను అధికారులు ఆయనకు వివరించారు. అనంతరం పట్టాభి మీడియాతో మాట్లాడుతూ..

# రైతాంగ సమస్యలే కేంద్రంగా నిలదీయాలి

(మొదటి పేజీ తరువాయి)

అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు పార్టీ అధ్యక్షుడు కె. చంద్రశేఖర్‌రావు దిశానిర్దేశం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న అవాస్తవాలు, వేస్తున్న నిందలను తిప్పికొట్టాలని సూచించారు. బుధవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో మంగళవారం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ శాసనసభాపక్షం సమావేశమైంది. 3 గంటల పాటు జరిగిన ఈ భేటీలో బీఆర్ఎస్ తరపున అసెంబ్లీలో లేవనెత్తాల్సిన అంశాలు, అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ దిశానిర్దేశం చేశారు. "రాష్ట్ర అప్పుల లెక్కలపై రేవంత్, మంత్రులు అబద్ధాలు చెప్తున్నారు. గత ఏడాదికాలంలో రాష్ట్ర ఆర్థిక రంగం కుదేలైంది. బడ్జెట్‌తోపాటు సవరించిన అంచనాలను కూడా ప్రభుత్వం సభ ముందు పెడుతుంది. ఆదాయ లోటు కూడా భారీగా ఉండబోతోంది. అందువల్ల బడ్జెట్ ప్రతిపాదనలను లోతుగా అధ్యయనం చేయండి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో వివిధ శాఖల మంత్రులుగా పనిచేసినవారు మన పార్టీ తరపున ఉభయ సభల్లోనూ ఉన్నారు. వారు 'షాడో కేబినెట్'లా వ్యవహరించి పద్దులపై చర్చ సందర్భంగా బడ్జెట్ ప్రతిపాదనల్లోని డొల్లతనాన్ని ఎండగట్టాలి.." అని కేసీఆర్ స్పష్టం చేశారు. తాగు, సాగునీటి కష్టాలతోపాటు రుణమాఫీ, రైతు భరోసా, విద్యుత్ కోతలు, వ్యవసాయ బోరు మోటార్లు కాలిపోతుండటం, ఎండుతున్న పంటలు వంటి రైతాంగ సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలతో వివిధ రంగాల్లో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానం, బడ్జెట్ ప్రతిపాదనలు, పద్దులు, ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ సందర్భంగా ఎత్తిచూపాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై నెలకొన్న ప్రజావ్యతిరేకతకు సోషల్ మీడియా అద్దం పడుతోందని, నిజానికి అంతకంటే ఎక్కువ వ్యతిరేకత క్షేత్రస్థాయిలో నెలకొందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ శాసనసభాపక్ష భేటీకి నలుగురు సభ్యులు ముందస్తు సమాచారం ఇచ్చి గైర్హాజరు అయ్యారు. వ్యక్తిగత పనులతో తాము సమావేశానికి రాలేకపోతున్నట్టు తెలిపారు. గైర్హాజరైన వారిలో ఎమ్మెల్యేలు మర్రి రాజశేఖర్‌రెడ్డి, అనిల్‌జాదవ్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు ఉన్నారు. దాదాపు 25 అంశాలపై దిశానిర్దేశం

సుమారు మూడు గంటల పాటు సాగిన బీఆర్ఎస్ ఎల్పీ సమావేశంలో కేసీఆర్ దాదాపు 25 అంశాలకు సంబంధించి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు దిశానిర్దేశం చేశారు. బీసీ, ఎస్సీ రిజర్వేషన్ల బిల్లులు, గురుకుల పాఠశాలలు, ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాలు, డీఏలు, పీఆర్సీ తదితరాలపై గొంతు వినిపించాలని సూచించారు. మహిళలు, ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు, వైద్యరంగంలో దిగజారిన ప్రమాణాలు, దళిత బంధు నిలిపివేత, గొర్రెలు, చేపపిల్లల పంపిణీ, ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదం వంటి అంశాలు ప్రస్తావించాలన్నారు. ఏపీ నదీ జలాల చౌర్యం, పాలమూరు%-%రంగారెడ్డి ప్రాజెక్టుపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం, ప్రభుత్వ బిల్లుల చెల్లింపులో 20శాతం కమిషన్ల ఆరోపణలు, పరిశ్రమల ఏర్పాటుకు బలవంతపు భూసేకరణ వంటి అంశాల్లో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని సూచించారు. కేంద్రం నుంచి నిధుల సాధన, కులగణనలో తప్పులు, బెల్ట్‌షాపుల తొలగింపు, ఎల్ఆర్ఎస్, మేడిగడ్డ పునరుద్ధరణ వంటి అంశాల్లో ప్రభుత్వ వైఖరిని నిలదీయాలని దిశానిర్దేశం చేశారు.

బుధవారం నుంచి ప్రారంభమవుతున్న అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ హాజరుకానున్నారు. ఆయన మంగళవారం ఉదయం ఎర్రవల్లి నివాసం నుంచి వచ్చి తెలంగాణ భవన్‌లో జరిగిన పార్టీ శాసనసభాపక్ష భేటీలో పాల్గొన్నారు.

# రౌడీలు, ఫ్యాక్షనిస్టులు అనే మాటే వినబడకూడదు

(మొదటి పేజీ తరువాయి)

తీస్తామని సీఎం హెచ్చరించారు. ఆడబిడ్డల జోలికి వస్తే అదే చివరిరోజు అవుతుందని స్పష్టం చేశారు. 'వైసీపీ ప్రభుత్వంలో నేను, మీరు, అందరమూ బాధితులమే. డ్రగ్స్, గంజాయి వినియోగం విపరీతంగా పెరిగింది. బాధ్యత గల ప్రతిపక్షంగా ఆందోళన చేస్తే.. తిరిగి టీడీపీ కార్యాలయంపై దాడి చేశారు. ఇంత దుర్మార్గాన్ని నా రాజకీయ జీవితంలో చూడలేదు. శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపైనా ఉంది. రాజకీయాల ముసుగులో నేరాలు, ఘోరాలకు పాల్పడతామంటే ఈ ప్రభుత్వంలో సాగదు. శాంతిభద్రతలను పరిరక్షించే పోలీసులకు ప్రభుత్వం అండగా ఉంటుంది. ఉదాశీనంగా వ్యవహరిస్తే పోలీసుల పట్ల కూడా కఠినంగా వ్యవహరిస్తాం' అన్నారు. సీఎం ఇంకా ఏమన్నారంటే..

### ప్రజలు కూడా సహకరించాలి

రాష్ట్రంలో గంజాయి సాగు చేసి ప్రజల జీవితాలతో చెలగాటమాడితే ఊరుకునేది లేదు. డ్రోన్ పెట్రోలింగ్‌తో గంజాయి సాగును గుర్తిస్తాం. ఒక్క ఎకరాలో కూడా గంజాయి పండించడానికి వీల్లేదు. వ్యాపారుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారి గంజాయి పండించే అమాయకులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తాం. తల్లిదండ్రులు కూడా గంజాయికి అలవాటుడిన తమ పిల్లల్ని జాగ్రత్తగా కంట్రోల్ చేయాలి. గత ప్రభుత్వం రాష్ట్రంలో గంజాయిపై కనీసం ఒక్కసారైనా సమీక్ష చేసిన పాపాన పోలేదు. అసెంబ్లీలో కూడా చర్చించలేదు. చివరికి పోలీసు వాహనాలకు పెట్రోలు కూడా ఇవ్వని పరిస్థితి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులను చక్కదిద్దుతున్నాం. రాష్ట్రంలో గంజాయి సాగు, డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు 'ఈగల్' ద్వారా ఇప్పటికే యుద్ధాన్ని ప్రారంభించాం. దీనిని ఆపేది లేదు.

### ఆడబిడ్డల జోలికొస్తే అదే గతి

సోషల్ మీడియాలో విచ్చలవిడితనం పెరిగిపోయింది. వ్యక్తిగత దూషణలతో ఆడబిడ్డలు తలెత్తుకుని తిరగలేని విధంగా వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు. ప్రేమ పేరుతో అమ్మాయిలను ఇబ్బందులు పెడుతున్నారు. ఆడబిడ్డల జోలికొస్తే వారికి అదే చివరి రోజవుతుంది. గతంలో ఇలాగే దాచేపల్లిలో ఒక అమ్మాయిపై అఘాయిత్యానికి పాల్పడిన నేరస్థుడిని పట్టుకోవడానికి 10 టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేశాం. ఇక తప్పించుకోలేనని భావించి నాలుగో రోజు అతనే ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. ఆడబిడ్డల జోలికొస్తే ఎవరికైనా ఇదే గతి పడుతుంది. ఆడబిడ్డలకు రక్షణగా నిన్ననే శక్తి యాప్‌ను ప్రారంభించాం. ఆడపిల్లలందరూ ఆ యాప్‌ను తమ సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆపద సమయంలో ఆ యాప్ ద్వారా సమాచారం అందిస్తే 6 నుంచి 9 నిమిషాల్లోనే పోలీసులు వస్తారు. ఇలాంటి ఫిర్యాదులు నమోదైన తర్వాత బాధితులకు ఏదైనా జరిగితే.. దానికి పోలీసులు బాధ్యత వహించాల్సి ఉంటుంది. దీనిపై అందరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై కూడా ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నేరస్థులకు 2, 3 నెలల్లోనే శిక్ష పడే పరిస్థితిని తీసుకువచ్చాం. సైబర్ నేరాలను అరికట్టేందుకు 26 సైబర్ పోలీసుస్టేషన్లు ఏర్పాటు చేస్తున్నాం. రాష్ట్రంలో గత ప్రభు త్వం సృష్టించిన భూ సమస్యలు భయంకరంగా ఉన్నాయి. భూ ఆక్రమణలు, కబ్జాలకు పాల్పడేవారు భయపడేలా త్వరలోనే ల్యాండ్ గ్రాబింగ్-2024 చట్టాన్ని తీసుకురానున్నాం.

### హత్యా రాజకీయాలకు పాల్పడలేదు

వైఎస్ వివేకా హత్య కేసులో ఆరుగురు సాక్షులు చనిపోవడం ఆలోచించాల్సిన అంశం. 2019లో నేను సీఎంగా ఉండగానే వివేకా హత్య జరిగింది. ఆయన గుండెపోటుతో చనిపోయారని ఆ రోజు ఉదయమే వాట్సాప్ మెసేజ్ వచ్చింది. నేను కూడా నిజమని నమ్మేశాను. నేరస్థులు ఏవిధంగా ట్రాప్‌లో పడేస్తారనడానికి ఇదొక ఉదాహరణ. నేను హత్యా రాజకీయాల మరక అంటకుండా 40ఏళ్లు రాజకీయాలు చేశాను. హత్యా రాజకీయాలు చేసినవారికి వ్యతిరేకంగా పోరాడి ప్రజాక్షేత్రంలో శిక్ష పడేలా చేసి.. వారిని రాజకీయాల్లో లేకుండా చేశానే తప్ప నేనెప్పుడూ హత్యా రాజకీయాలు చేయలేదు' అని చంద్రబాబు వివరించారు.

## స్వయం ఉపాధికి

# రూ.6 వేల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులను పట్టించుకోలేదని, ఆయా వర్గాల కోసం పెట్టిన ఆర్థిక కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో నిరుద్యోగ యువత కోసం కొత్త పథకాన్ని తెస్తున్నామని చెప్పారు. ఈ పథకం కింద ఆయా వర్గాలకు చెందిన యువకులకు వ్యక్తిగతంగా రూ.3 లక్షల వరకు ఆర్థిక సాయం చేస్తామని చెప్పారు. ఇందుకోసం ఈ నెల 15న నోటిఫికేషన్ జారీ చేస్తామని, ఆ రోజు నుంచే ఆన్‌లైన్‌లో రాజీవ్ యువ వికాసం పథకం కోసం నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. వచ్చే నెల 5 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని, ఏప్రిల్ 6 నుంచి మే 31 వరకు ఈ దరఖాస్తులను పరిశీలించి, జిల్లాల కలెక్టర్లు అర్హులను ఎంపిక చేస్తారని వివరించారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా లబ్దిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తామని చెప్పారు. ప్రస్తుతానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల నిరుద్యోగులకు ఆయా కార్పొరేషన్ల ద్వారా ఈ పథకాన్ని అమలు చేస్తామని, ఇతర వర్గాలకు కూడా భవిష్యత్తులో అమలు చేసే ఆలోచన ఉందని భట్టి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వమే నిరుద్యోగులకు బ్యాంకు లింకేజీతో రుణం ఇప్పిస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు సమానంగా ప్రయోజనం చేకూరుస్తామన్నారు.

### ఐలమ్మ వర్సిటీకి రూ.540 కోట్లు

వీర వనిత చాకలి ఐలమ్మ పేరిట ఏర్పాటు చేసిన మహిళా విశ్వవిద్యాలయం అభివృద్ధి కోసం రూ.540 కోట్లు కేటాయించామని, దేశంలోనే ఉత్తమ వర్సిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి చెప్పారు. ఈ వర్సిటీ ప్రాంగణంలో ఉన్న చారిత్రక కట్టడాలను పునరుద్ధరించేందుకు మాస్టర్‌ప్లాన్ రూపొందించినట్టు చెప్పారు. వర్సిటీ ప్రధాన ద్వారం మూసీ నదిని ఆనుకుని ఉందని, మూసీ పునరుజ్జీవం తర్వాత ఈ ప్రధాన గేటును తిరిగి ప్రారంభిస్తామన్నారు. వారసత్వ కట్టడాల పునరుద్ధరణ పనుల ప్రారంభానికి తక్షణమే రూ.15.5 కోట్లు, నూతన భవనాల నిర్మాణానికి రూ.100 కోట్లు విడుదల చేస్తున్నట్టు భట్టి వెల్లడించారు.

# భారత్‌కు, గ్లోబల్ సౌత్‌కు మధ్య ఒక వంతెన

పోర్ట్ లూయిస్: భారత్‌కు, గ్లోబల్ సౌత్‌కు మధ్య మారిషస్ ఒక వంతెన అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మారిషస్ కేవలం భాగస్వామ్య దేశం మాత్రమే కాదని, భారతదేశ కుటుంబంలో ఒక అంతర్భాగమని చెప్పారు. మారిషస్ అంటే 'మినీ ఇండియా' అని అభివర్ణించారు. ఆయన మంగళవారం మారిషస్ రాజధాని పోర్ట్ లూయిస్‌లో ప్రవాస భారతీయులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో మారిషస్ ప్రధాని డాక్టర్ నవీన్‌చంద్ర రామ్‌గూలమ్, వీణా దంపతులు, మంత్రివర్గ సభ్యులు సైతం పాల్గొన్నారు. భారత్, మారిషస్ మధ్య బలమైన చారిత్రక సంబంధాలు ఉన్నాయని మోదీ గుర్తుచేశారు. ఓవర్సీస్ సిటిజెన్ ఆఫ్ ఇండియా(ఓసీఐ) కార్డులను రామ్‌గూలమ్ దంపతులకు మోదీ అందజేశారు. మారిషస్‌లోని ఏడో తరం భారతీయులకు కూడా ఈ కార్డులు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. అంతకుముందు రెండు రోజుల పర్యటన నిమిత్తం మారిషస్‌కు చేరుకున్న ప్రధాని మోదీకి చిరస్మరణీయమైన స్వాగతం లభించింది.

రాజధాని పోర్ట్ లూయిస్‌లోని సర్ సీవూసాగర్ రామ్‌గూలమ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర రామ్‌గూలమ్‌తోపాటు ఉప ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నేషనల్ అసెంబ్లీ స్పీకర్, ప్రతిపక్ష నేత, విదేశాంగ మంత్రి, కేబినెట్ సెక్రెటరీ తదితరులు ఘన స్వాగతం పలికారు. మోదీని స్వాగతించడానికి మొత్తం మంత్రివర్గం తరలిరావడం గమనార్హం. మంత్రులు, అధికారులు సహా 200 మందికి ఆయన కోసం ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు.

### బిహారీ సంప్రదాయ స్వాగతం

మారిషస్‌లో నివసిస్తున్న భారతీయులు ప్రధాని మోదీకి సాదర స్వాగతం పలికారు. మోదీ బస చేసిన హోటల్ వద్ద భారతీయ మహిళలు సంప్రదాయ బిహారీ సాంస్కృతిక సంగీతభరిత నృత్యం 'గీత్ గవాయ్'తో ఆయనను స్వాగతించారు. అలాగే భోజ్‌పురి సంప్రదాయ గీతం ఆలపించారు. భారత త్రివర్ణ పతాకం చేతబూని 'భారత్ మాతాకీ జై' అని బిగ్గరగా నినదించారు. తనకు లభించిన అపూర్వమైన గౌరవ మర్యాదల పట్ల ప్రధాని మోదీ సంతోషం వ్యక్తం చేశారు.

### మారిషస్ అధ్యక్షుడికి గంగాజలం బహూకరణ

మారిషస్ అధ్యక్షుడు ధరమ్ గోకుల్‌కు ప్రధాని మోదీ అరుదైన కానుక అందజేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ప్రయాగ్‌రాజ్‌లో త్రివేణి సంగమం వద్ద జరిగిన మహా కుంభమేళా సమయంలో ఇత్తడి, రాగి పాత్రలో సేకరించిన పవిత్ర గంగజలాన్ని బహూకరించారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానిది దివాలాకోరుతనం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి వనరులకు తగ్గట్టుగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఇన్ని నెలల తర్వాత రూ.1.5 లక్షల కోట్లు కావాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం హాస్యాస్పదమన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రూ.3 లక్షల కోట్ల అప్పు మాత్రమే ఉందనుకున్నామని, ఇప్పుడు రూ.7.5 లక్షల కోట్లు ఉందని తెలిసిందని, అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నామని చెప్పడం.. రాహుల్, రేవంత్, కాంగ్రెస్ అసమర్థతకు అద్దం పడుతోందని ధ్వజమెత్తారు. వైఫల్యాలను ప్రశ్నిస్తున్న ప్రజల దృష్టిని మళ్లించడం కోసం ఇప్పుడు కేంద్రాన్ని డబ్బులు అడగటం దివాళాకోరుతనమని మండిపడ్డారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా దేశ, రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని కేంద్ర ప్రభుత్వం అమలు చేసి తీరుతుందని తెలిపారు. తెలంగాణలో రీజినల్ రింగ్ రోడ్డును తప్పకుండా పూర్తి చేస్తామన్నారు. రైల్వే ప్రాజెక్టులకు ఇచ్చిన హామీ కంటే ఎక్కువ నిధులే కేటాయిస్తామని తెలిపారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ పనులు 65 శాతం పూర్తయ్యాయని చెప్పారు. రూ.750 కోట్ల వరకు బడ్జెట్ పెరిగే అవకాశం ఉన్నా, వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఉత్పత్తి ప్రారంభిస్తామని వెల్లడించారు. కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి భూమి పూజ చేసిన విషయం కూడా కాంగ్రెస్ ఎంపీలకు తెలియకుండా, దాని గురించి రైల్వే మంత్రికి మెమొరాండం ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు.

### 'వూట్జ్.. ది ఫర్‌గాటెన్ మెటల్ క్రాఫ్ట్ ఆఫ్ డెక్కన్' పుస్తకావిష్కరణ..

'వూట్జ్.. ది ఫర్‌గాటెన్ మెటల్ క్రాఫ్ట్ ఆఫ్ డెక్కన్' పుస్తకాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రెండు వేల ఏళ్ల కిందటే స్టీలు వంటి అద్భుతమైన లోహాల తయారీలో మన పూర్వీకులు ఎంతో ప్రావీణ్యం సంపాదించారని తెలిపారు. స్టీలు కన్నా శక్తిమంతమైన లోహమైన 'వూట్జ్' గురించి ప్రపంచానికి తెలియజేసేందుకు రచయిత జై కిషన్ శ్రీ పెరంబుదూరు చేసిన కృషిని ప్రశంసించారు. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్‌లో ఈ లోహం ఒకప్పుడు అందుబాటులో ఉండేదని తన పరిశోధనలో వెల్లడైందని పుస్తకంలో పేర్కొన్నారని స్పష్టం చేశారు. ఈ లోహాన్ని వెలికితీసేందుకు జీఎస్ఐని ఆదేశిస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు.

# అరవింద్ కేజ్రీవాల్‌కు ఎదురుదెబ్బ


(మొదటి పేజీ తరువాయి)

అదేశించింది. కేజ్రీవాల్, ఆప్ మాజీ ఎమ్మెల్యే గులాబ్ సింగ్, మాజీ ద్వారక కౌన్సిలర్ నితిక శర్మ ఉద్దేశపూర్వకంగానే ప్రజా నిధులను దుర్వినియోగం చేస్తూ ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో భారీ హోర్డింగ్‌లు పెట్టారని పిటిషనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వీరందరిపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టును కోరారు. దీనిపై అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ నేహా మిట్టల్ మంగళవారం నాడు ఢిల్లీ పోలీసులకు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ ఆదేశాలిచ్చారు. దీనికి ముందు 2022లో ఈ ఫిర్యాదును మెట్రోపాలిటన్ మెజిస్ట్రేటు తోసిపుచ్చారు. అయితే సెషన్ కోర్టు ఆ నిర్ణయాన్ని కొట్టివేస్తూ పిటిషన్‌ను పునఃపరిశీలించాలని మెజిస్ట్రేట్‌ను ఆదేశించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 'ఆప్' పదేళ్ల పాలనకు బీజేపీ గండికొడుతూ ఘనవిజయం సాధించింది. ఈ క్రమంలో హోర్డింగ్‌ల పేరుతో ప్రజానిధుల దుర్వినియోగంపై కేజ్రీవాల్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు కోర్టు ఆదేశాలివ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# గ్రూప్-2 పరీక్షా ఫలితాలు విడుదల

హైదరాబాద్,:ప్రభుత్వ శాఖల్లోని ఖాళీల భర్తీకి నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష ఫలితాలు మంగళవారం సాయంత్రం విడుదలయ్యాయి. జనరల్ ర్యాంకింగ్ లిస్టును టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. 783 పోస్టుల భర్తీకి 2022లో గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదలకాగా, 5 లక్షలకుపైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ పరీక్షలకు 46 శాతం మంది అభ్యర్థులు మాత్రమే హాజరయ్యారు. అంటే సగానికి సగం మంది మాత్రమే గ్రూప్-2 పరీక్షలను రాశారు. 2024 డిసెంబర్ 15, 16న పరీక్షలు నిర్వహించారు.

# హామీల అమలులో జాప్యం ఆర్థిక పరిస్థితి బాగాలేకనే



వైరా/నేలకొండపల్లి, ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందిగా ఉందని, అందువల్లే హామీల అమలులో జాప్యం జరుగుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. మంగళవారం ఖమ్మం జిల్లా వైరా మండలం పుణ్యపురంలో పైలట్ ప్రాజెక్టుగా రూ.5.45 కోట్లతో నిర్మించనున్న 109 ఇందిరమ్మ గృహాలకు ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. నేలకొండపల్లి మండలం నాచేపల్లి గ్రామంలోనూ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతులందరికీ రైతుభరోసా సాయాన్ని ఈ నెలాఖరులోగా పూర్తిగా చెల్లిస్తామన్నారు. కొందరికి ఇంకా రుణమాఫీ అందని మాట వాస్తవమేనని, ఆ సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని రూ.7.19 లక్షల కోట్ల మేర అప్పులపాలు చేశారని ఆరోపించారు. ఆర్థిక సంక్షోభాన్ని అధిగమిస్తూనే తమ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. కేవలం మూడు నెలల్లోనే రైతులకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామన్నారు. 2004%-% 2014 కాలంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఉమ్మడి ఏపీలో 23 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించిందని చెప్పారు. ఆ తరువాత కేసీఆర్ పదేళ్లలో 1.5 లక్షల డబుల్ బెడ్‌రూం ఇళ్లు మాత్రమే మొదలుపెట్టారని, వాటిని కూడా పూర్తిచేయకుండా వదిలేశారని ఆరోపించారు. ప్రస్తుత తమ ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే 4.16 లక్షల పైచిలుకు ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తోందన్నారు.

సామాన్యుడి ఆయుధం
T/AP/2024/0304/1072/41
3
అస్త్రం
ANDHRA PRADESH
prajalaastram999@gmail.com
ప్రకాశం - బాపట్ల
బుధవారం 12 -3-2025





## సమరసత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగర సంకీర్తన కార్యక్రమం

**చంద్రశేఖరపురం : అస్త్రం న్యూస్:** మండలంలోని అయ్యలూరివారిపల్లి గ్రామంలో ఏకాదశి సందర్భంగా సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగర సంకీర్తన కార్యక్రమం ఘనముగా నిర్వహించారు ఈ సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన కార్యక్రమంలో పాల్గొన్నారు గ్రామంలోని ప్రధాన వీధుల్లో భజనలు చేస్తూ స్వామివారి భక్తి గీతాలు అలపిస్తూ నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ మండల కమిటీ సభ్యులు నేలటూరి రమణారెడ్డి గ్రామ ధార్మిక సమితి సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు

## సచివాలయమును తనిఖీ చేసిన ఎంపీడీవో

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలి : ఎంపీడీవో

సచివాలయం కు వచ్చిన ప్రజలకు పనులు త్వరగా అయ్యే విధంగా చూడాలి : ఎంపీడీవో





పామూరు అస్త్రం మార్చి 11 మండలంలోని బలిజ పాలెం గ్రామ సచివాలయమును ఎంపీడీవో ఎల్ బ్రహ్మయ్య ఆకస్మిక తనిఖీ నిర్వహించారు సచివాలయ సిబ్బంది హాజరు రికార్డులను రిజిస్టర్లను పరిశీలించారు ఈ సందర్భంగా ఎంపీడీవో బ్రహ్మయ్య మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది అందరూ తప్పనిసరిగా టైముకు విధులకు హాజరు కావాలని ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే సకాలంలో పూర్తి చేయాలని సర్వే చేసే సమయంలో అందరూ వెళ్లకుండా ఒకరు సచివాలయంలో అందుబాటులో ఉండాలని అన్నారు ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికి అందే విధంగా సచివాలయం సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు అనంతరం సర్వేలను పరిశీలించి సచివాలయ సిబ్బందికి తగు సూచనలు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్ లో 2.5లక్షల కోట్లు కేటాయించాలి

సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పూసపాటి వెంకటరావు డిమాండ్

**అస్త్రం న్యూస్ :** గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్ లో 2.5లక్షల కోట్లు కేటాయించాలని, ఏడాదికి 200రోజులకి పనిదినాలు పెంచాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పూసపాటి వెంకటరావు డిమాండ్ చేశారు. మంగళవారం ప్రజచైతన్య యాత్రలలో భాగంగా కేవీపాలెం, మువ్వావారిపాలెం లలో పనిచేస్తున్న ఉపాధి హామీ కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.తమిళనాడు, కేరళ రాష్ట్రలలో మాదిరి ఉపాధి హామీని పట్టణాలకు కూడా విస్తరింపచేయాలని, పనిప్రదేశంలో కూలీలకు కల్పించాల్సిన మౌలికవసతులు కల్పించాలని వెంకట్రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో కి వస్తే వ్యవసాయ కార్మికులకు సంక్షేమబోర్డ్ ఏర్పాటు చేస్తామని చెప్పారని అధికారంలో కి వచ్చి 9నెలలు అవుతున్నా ఆ ఊసే లేదని విమర్శించారు. పెండింగ్ లో ఉన్న బిల్లులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పులి ఓబులరెడ్డి, నల్లూరి కృష్ణయ్య, కొల్లూరి అక్కయ్య, బ్రహ్మయ్య, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# దేవాదాయ భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టిన దేవాదాయ శాఖ ఎ సి

దేవాదాయ శాఖ కి చెందిన స్థలాలలో హెచ్చరిక బోర్డ్ లు.

గతం లో బోర్డులు పెట్టిన స్థలాల ఆక్రమణ దారు లకు నోటీసులు.

ఖాళీ భూములకు శాశ్వత కంచ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఇ ఓ ని ఆదేశించిన ఎ సి పానకా లరావు.

మూకుమ్మడిగా వెలసిన హెచ్చరిక బోర్డు లతో సింగరాయకొండ లో కలకలం.







**సింగరాయకొండ: అస్త్రం న్యూస్ ప్రతినిధి:** చెరపకురా చెడెదవు అన్న సామెత సింగరాయకొండ నిజమైంది. పాత సింగరాయకొండ వరాహ లక్ష్మీ నారసింహ స్వామి దేవస్థానానికి చెందిన భూముల ఆక్రమణల నేపథ్యంలో ట్రంక్ రోడ్డు ప్రక్కన ఉన్న స్థలం వివాదం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టే పరిస్థితికి దారి తీసింది. సింగరాయకొండ తో సహా పాత సింగరాయకొండ, సోమరాజు పల్లి గ్రామ పంచాయితీల పరిధిలో వరాహ లక్ష్మీ నారసింహ దేవస్థానానికి భూములు ఉన్నాయి. వాటిని దేవాదాయ ధర్మాదాయ శాఖ తమ ఆస్తులుగా ప్రకటించి వాటికి విషయం లో హక్కులు దేవాదాయ ధర్మాదాయ శాఖ కి చెందినవిగా ప్రకటించి క్రయ విక్రయాలు అధికారికంగా నిలిపి వేశారు. దాదాపు సింగరాయకొండ లో గత కొన్ని సంవత్సరాలుగా భూ క్రయ విక్రయాలు అధికారికంగా నిలిచి పోయాయి. నాలుగైదు తరాల నుండి ఈ భూముల ఆక్రమణలు, క్రయవిక్రయాలు, భూ హక్కు లు పొంది లావాదేవీలు చేసుకుంటున్నారు. వీటిలో శాశ్వత లీజు( 99 సంవత్సరాల) కింద పొంది ఉన్న భూముల క్రయ విక్రయాలు జరిగి పోయాయి. అయితే ఇటీవల సింగరాయకొండ గ్రామ పంచాయతీ పరిధిలో కూరగాయలు మార్కెట్ సెంటర్లో ఉన్న మసీదు రోడ్డు వద్ద చేపట్టిన నిర్మాణానికి సంబంధించి స్థానికులకు అక్కడ నిర్మాణాలు చేపట్టిన వారికి మధ్య వివాదం చెలరేగింది. అది చిలికి చిలికి గాలివాన గా మారి ఆమరణ దీక్షలు, పోలీస్, రెవెన్యూ, పంచాయితీ, రూరల్ వాటర్ వర్క్స్, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల ప్రమేయానికి దారి తీసింది. దానితో ఆ వివాదం జిల్లా జాయింట్ కలెక్టర్ వరకు చేరింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగేదే లేదు అంటూ స్థానికులు, అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కోర్టు ఆదేశాలతో దేవాదాయ ధర్మాదాయ శాఖ దేవాదాయ చట్టం, నిబంధనల ప్రకారం చర్యలకు ఉపక్రమించారు. ఈ క్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ సదరు వివాదాస్పద భూమిలో రెండు హెచ్చరిక బోర్డులను జిల్లా సహాయ కమీషనర్ పానకాల రావు ఆధ్వర్యం లో ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఇఓ కృష్ణవేణీ ఏర్పాటు చేశారు. ఈ వివాదం ప్రభుత్వ పెద్దలు, జిల్లా యంత్రంగం కోర్టుకు చేరింది. ఇక్కడ ఎవరు తగ్గేదేలే అంటూ ఎవరి పని వారు చేసుకుంటూ పోతున్నారు. ఇది ఇలా ఉండగా ఆ ప్రాంత ప్రజలు రోడ్డు పక్కన ఆక్రమణలు తొలగించాలని, స్థానిక ఎం ఆర్ పి ఎస్ నాయకులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ భూమిని పరిరక్షించాలని, జిల్లా కలెక్టర్ ని కలిసి గ్రీవెన్స్ సెల్ లో పలు మార్లు ఫిర్యాదులు చేయడం తో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో కదిలిన దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ పానకాల రావు స్పందించి తమ సిబ్బంది తో కలిసి తన వెంట ప్రత్యేక వాహనం లో శాశ్వత హెచ్చరిక బోర్డు లను తీసుకుని స్వయంగా రంగం లో దిగి సింగరాయకొండ లో దేవాదాయ ధర్మాదాయ శాఖకి చెందిన భూముల వద్ద హెచ్చరిక భూములను ఏర్పాటు చేశారు. ముందుగానే ప్రత్యేకించి దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు సింగరాయకొండ లో ఉన్న ఖాళీ స్థలాలు, ఆక్రమణలో ఉన్న స్థలాల వద్ద శాశ్వత బోర్డులు ఏర్పాటు చేశారు. అంతే కాకుండా గతం లో ఆక్రమణ కి గురయిన భూములకు సంబంధించి ఆక్రమణ దారులకు నోటీసులు ఇచ్చినట్లు ఇఓ ఎసి దృష్టికి తీసుకు పోయారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ పానకాల రావు పాకల రోడ్డు కూడలి లోని భూమి వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తూ అక్కడ ఆక్రమణల కి పాల్పడిన వారిని హెచ్చరిస్తూ కాలి చెయ్యాలని ఆదేశించారు. అంతే కాకుండా ఈ భూమికి శాశ్వత కంచే ఏర్పాటు చెయ్యాలని దానికి సంబంధించి ప్రతి పాదనలను వెంటనే పంపమని ఇఓ ని ఆదేశించారు. మార్కెట్ సెంటర్ లో తలెత్తిన వివాదం పర్యవసానం గా సింగరాయకొండ కందుకూరు రోడ్డు కూడలి వద్ద, రెండు చోట్ల హెచ్చరిక బోర్డు లు ఏర్పాటు చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ పానకాల రావు, ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఇఓ కృష్ణవేణీ దేవాదాయ శాఖ భూముల పరిరక్షణ కోసం చేపట్టిన చర్యలు చర్చ నియాంశం అయింది. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారుల చర్యల పర్యవసానం ఎటు దారి తీస్తుందో అని ప్రజలు, భూములు కోల్పోయే ప్రజలు, ఆందోళన చెందుతున్నారు.

## అభివృద్ధి నిధులపై ముఖ్యమంత్రి కి వినతి : శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర



**అస్త్రం న్యూస్ : కనిగిరి :** కనిగిరి నియోజకవర్గ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని, మా ప్రాంత ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి వినతి పత్రం ద్వారా కోరారు. మంగళవారం అమరావతి లోని ముఖ్యమంత్రి కార్యాలయంలో నియోజకవర్గ సమస్యలు తెలియజేసి నిధులు కేటాయించాలని కోరారు. సందర్భంగా ఆయనఫ్లోరోసిస్ సమస్యకు పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని,విద్యార్థులకు హాస్టల్ సదుపాయాలు మెరుగుపరచాలని,ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి నిధులు కేటాయించాలని,డయాలసిస్ సెంటర్ ఆధునీకరణకు చర్యలు తీసుకుని నిధులు కేటాయించాలి కోరారు. అలాగే మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల గురుకుల హాస్టల్‌కు శాశ్వత భవనం నిర్మాణం చేపట్టేందుకు నిధులు కేటాయించాలనికోరుతూ వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందిచి ఈ అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన నిధుల కేటాయింపునకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంగీకారం తెలిపారు. ఈ నిర్ణయంతో కనిగిరి అభివృద్ధిలో మరో ముందడుగు పడనుంది. అనునిత్యం కనిగిరి అభివృద్ధి లక్ష్యంగా శ్రమిస్తున్న శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ని నియోజకవర్గ ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు.

## పాకల గ్రామాన్ని "న్యూట్రి స్మార్ట్ గ్రామంగా" అభివృద్ధి చేసే దిశగా కృషి





**సింగరాయకొండ: అస్త్రం న్యూస్ :** పోషకాహార భద్రతను పెంపొందిస్తూ, సమగ్ర సస్యరక్షణ విధానాలను ప్రోత్సహించేందుకు కృషి విజ్ఞాన కేంద్రం, కందుకూరు ఆధ్వర్యంలో పాకల గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది.కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డా. జి. ప్రసాద్ బాబు, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డా. బి. నీహారిక ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాల ఉపాప్రణాళిక క్రింద మహిళలకు కూరగాయల విత్తన కిట్లను పంపిణీ చేశారు. పోషకాహార భద్రతను మెరుగుపరిచేందుకు ప్రతి ఇంటి పెరటిలో కూరగాయలు, ఆకుకూరలు పెంచుకోవాలని, తద్వారా పాకల గ్రామాన్ని "న్యూట్రి స్మార్ట్ గ్రామంగా" అభివృద్ధి చేస్తున్నామని డా. ప్రసాద్ బాబు తెలిపారు.డా. బి. నీహారిక మాట్లాడుతూ, ఈ కిట్లలో టమాట, బ్రాడ్ బీన్స్, చిక్కుడు, వంగ, యార్డ్ లాంగ్ బీన్స్, తోటకూర, మిరప వంటి 8 రకాల విత్తనాలు ఉన్నాయి. వాటిని శాస్త్రీయంగా పెంచుకునే విధానాలను, ఉత్తమ యాజమాన్య పద్ధతులను, సమగ్ర సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించామన్నారు. పోషకాహార భద్రత కోసం సామూహిక పెరటితోటలు, బయోఫోర్టిఫైడ్ చిరుధాన్యాలైన రాగులు, సజ్జలు, సామల పెంపకంపై ప్రాథమిక ప్రదర్శనలు ఇచ్చారు.ఎపి సి ఎన్ ఎఫ్ మండల ఇంచార్జ్ వెంకటరమణ, ప్రకృతి వ్యవసాయంలో బీజామృతం, కాషాయాలు, జీవామృతం తయారీ మరియు అవి కలిగించే ప్రయోజనాలను వివరించారు. రసాయన పురుగు మందులు లేకుండా కూరగాయల పెంపకం చేయగల విధానాలను రైతులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాకల రైతు సేవా కేంద్రం గ్రామ వ్యవసాయ సహాయకుడు సురేష్, ఐ.సి.ఆర్.పి రామసుబ్బమ్మ, గ్రామ సంఘం వి.ఓ.ఏ మౌనిక తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం రైతులు, మహిళలలో విస్తృత స్పందనను పొందింది.

సామాన్యుడి ఆయుధం
అస్త్రం
T/AP/2024/0304/1072/41
ANDHRA PRADESH
prajalaastram999@gmail.com
ప్రకాశం - బాపట్ల
బుధవారం 12 -3-2025



# కనిగిరి వైసీపీలో ప్రజలతో మమేకమయ్యే నాయకులేరి??

## పార్టీ అధిష్టానం పిలుపుపైనే ఏవైనా కార్యక్రమాలు

## ఎన్నికల్లో బోల్తాపడిన తరువాత నియోజకవర్గంలో అంతట నేటికీ స్తబ్దతే.

లిఅస్త్రం న్యూస్, కనిగిరి: 2024 ఎన్నికల్లో బొక్క బోర్లా పడిన తర్వాత వైసీపీని ఆవహించిన స్తబ్దత కనిగిరి నియోజకవర్గం లో కొనసాగుతూనే వస్తుంది. వైసిపి పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పట్టణంతోపాటు, గ్రామాలలో సైతం సందడి చేసిన నేతల్లో ఏ ఒక్కరూ ఇప్పుడు యాక్టివ్గ గా లేని పరిస్థితి ఇప్పటికీ తెలుస్తుంది. ఇది ఇలా ఉంటే ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు కూడా నాయకులమని చెప్పుకున్న ఆనాటి నాయకులలో కొంతమంది కూడా నేటికీ ఆసక్తి చూపకపోవడంతో వైసిపి పార్టీ ఆచూకీ క్రమక్రమేనా తగ్గుతుందనే వాదనలు బాహాటంగానే అక్కడక్కడ వినిపిస్తున్నాయి. ఎల్లయ్యను, ఎల్లప్పను పొగడక్కర్లేదు అన్న చందంగా దాదాపుగా కనిగిరి నియోజకవర్గం లోని 6 మండలాలలో స్తబ్దత రాజ్యమేలుతుందన్న పరిస్థితి పార్టీ శ్రేణుల నుంచే విన వస్తుంది స్థానికంగా నెలకొన్న పరిస్థితులను అధ్యయనం చేసే నాథుడు కూడా కరువయ్యారని స్పష్టంగా కనబడుతున్నట్లుంది. ఇది ఇలా ఉంటే ప్రభుత్వ పోకడలకు వ్యతిరేకంగా ఏవైనా కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ అధిష్టానం పిలుపునిచ్చినప్పుడు మాత్రమే స్థానిక నేతలు కార్యక్రమాల్లో పాల్గొంటూ మమ అనిపిస్తున్నారు. కొందరైతే కూటమి ప్రభుత్వ నాయకులతో కలిసి వ్యాపార లావాదేవీలు జరుపుకుంటు పార్టీ పట్టిష్టతపై దృష్టి సారించక తమ పబ్బం గడుపుకుంటున్నారు . దీంతో దాదాపుగా నియోజకవర్గంలోని అన్ని మండలాలలో కొన్ని గ్రామాలలో ఇదే పరిస్థితి నెలకొనడంతో ప్రతిపక్ష పార్టీ శ్రేణుల్లో స్తబ్దత రాజ్యమేలుతుంది. గత ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత ఆ పార్టీలో ప్రారంభమైన స్తబ్దత ఇప్పటికీ అనివార్యంగానే కొనసాగుతుంది. పార్టీ శ్రేణులు తమ గోడు వినిపించుకునేందుకు అవకాశము లభించలేదని అధిక శాతం మంది వాపోతున్నారు. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో కొంతమేర సమస్యలు రాజ్యమేలుతున్నప్పటికీ ఆయాచోట్ల ప్రజలు మౌనంగా భరించడం అనివార్యమైన పరిస్థితి. ప్రత్యేకించి వైసీపీలోని ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు అసంతృప్తితో రగిలిపోతున్నట్లు పరిస్థితులు చెబుతున్నాయి. కూటమిలో జనసేన, బిజెపి లాంటి పార్టీలు సైతం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం కొన్నిచోట్ల ఈపాటికి రంగం సిద్ధం



చేసుకుంటుండగా ప్రతిపక్ష వైసిపి లో మాత్రం ప్రజల్లో మమేకమై ఎందుకు నేటికీ ఆసక్తి చూపని పరిస్థితి. ఇది ఇలా ఉంటే గత స్థానిక సంస్థ ఎన్నికల్లో అధికారంలో ఉన్నప్పుడు అన్నీ గెలుచుకున్నాం, ఏకగ్రీవమయ్యాం అని సందడి చేసుకున్న ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు ప్రస్తుతం నోరు మెదపకుండా రాష్ట్ర పార్టీ ఆదేశానుసారం చేపట్టే కార్యక్రమాలలోనే నియోజవర్గ స్థాయిలో పాల్గొంటూ మేము వచ్చాం, కార్యక్రమాల్లో పాల్గొన్నామంటూ సరిపుచ్చుకుంటున్నారు. స్థానిక సంస్థల్లో ప్రస్తుత అధికారం వైసీపీ ది అయినప్పటికీ ఆ మేర ఆ పదవులు పొందిన బాధ్యులు మాత్రం చురుకైన పాత్ర పోషిస్తున్న సందర్భాలు పరిమితంగా ఉన్నాయని చెప్పక తప్పని పరిస్థితి.



## మార్చి 12 వ తేదీన నిర్వహించే "యువత పోరు" కార్యక్రమం పోస్టర్ ఆవిష్కరణ



సింగరాయకొండ: అస్త్రం న్యూస్ ప్రతినిధి: కూటమి ప్రభుత్వం అనేక హామీలను ఇచ్చి అధికారం చేపట్టి ఇప్పటికే సుమారుగా 10 నెలలు పూర్తి కావస్తున్నప్పటికీ కూడా రాష్ట్రంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకునే పరిస్థితి లేక ఉద్యోగాల కల్పన లేకుండా, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా యువతను అలానే ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెనల బకాయిలు చెల్లించకుండా, వైద్య విద్యను ప్రైవేటీకరిస్తూ విద్యార్థులను నిలువునా మోసగించిన కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి బకాయిలు చెల్లించేలా అన్ని జిల్లా కేంద్రాల్లో ఈనెల 12వ తేదీన "యువత పోరు" కార్యక్రమం చేపట్టాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు ప్రకాశం జిల్లా ఒంగోలులో 12వ తేదీన భారీ నిరసన కార్యక్రమం నిర్వహించనున్న నేపథ్యంలోమంగళవారం "యువత పోరు" పోస్టర్ విడుదల చేయడం జరిగిందని మాజీమంత్రి,వైస్సార్సీపీ రాష్ట్ర పి ఎ సి సభ్యులు కొండేపి నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్. ఆదిమూలపు సురేష్ సింగరాయకొండ క్యాంపు కార్యాలయంలో తెలియజేశారు.యువత పోరు కార్యక్రమం విజయవంతం చేయాలని కొండేపి నియోజకవర్గం ఇంచార్జ్ డా. ఆదిమూలపు సురేష్ గారు మంగళవారం సింగరాయకొండ డా ఆదిమూలపు సురేష్ గారి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన యువత పోరు పోస్టర్ విడుదల కార్యక్రమం అనంతరం మీడియా ద్వారా పిలుపు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నిరుద్యోగ యువతీ యువకులను, విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలని తెలిపారు. 12వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని కలెక్టర్ కు మెమోరాండం సమర్పించడం జరుగుతుంది అని తెలిపారు.

## ప్రజలకు సేవలు అందించని ఉద్యోగులు ఎందుకు...

### కొయ్యూరు ఎంపీపీ రమేష్.

కొయ్యూరు అస్త్రం ప్రతినిధి: కొయ్యూరు మండలం కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బడుగు రమేష్ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూగిరిజనులకు సేవలు అందించని ఉద్యోగుల అవసరం లేదని ఎంపీపీ బడుగు రమేష్ మండిపడ్డారు. సర్వసభ్య సమావేశానికి రాని వైద్యాధికారులు అటవీ శాఖ అధికారులపై ఆయన మండిపడ్డారు. మధ్యాహ్నం 12 గంటలకు మొదలుపెట్టిన సర్వసభ్య సమావేశంలో ముందుగా ఐసిడిఎస్ ఉపాధి హామీ విద్యశాఖ , వ్యవసాయ శాఖ, పశు వైద్య శాఖ అధికారులు తమ తమ సమస్యలను చెప్పగా సర్వసభ్య సమావేశానికి డుమ్మా కొట్టిన అటవీ శాఖ అధికారులు వైద్యాధికారులను ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయవలసిందిగా ఎంపీడీవోను ఎంపీపీ ఆదేశించారు. స్వాతంత్రం రాక ముందు నుంచి మారుమూల గ్రామంలో బ్రతుకున్న గిరిజనులకు రహదారి సౌకర్యం లేకుండా ఫారెస్ట్ అధికారులు అడ్డుపడటంతో వారిని దుయ్యబట్టారు ఎన్ఆర్జిఎస్ ఏపీవో విధులకు రానందున ఆయనపై మండిపడగా అనంతరం ఆయన వచ్చిన తర్వాత కొంతమంది అధికారులు నాయకులు చెప్పినట్లుగా చేస్తున్నారని అలాగే జరిగితే ఇక ముందు ఇబ్బంది పడవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు అటవీ ప్రాంతంలో యూచిడిపాలెం పరిధిలో ఉన్న 12 కిలోమీటర్ల రోడ్డు పలకజీడి వరకు నిర్మించగా మధ్యలో ఉన్న కల్వర్టు కు ఫారెస్ట్ అధికారులు ఎందుకు గిరిజన ప్రజలకు ఇబ్బందులు పెడుతున్నారో చెప్పవలసిన పరిస్థితి ఏర్పడిందని ఎంపీపీ బడుగు రమేష్ బాబు అన్నారు.



# 3465 ఎకరాలలో 1340 మంది మాత్రమే రైతులకు పంట నమోదు

## ఈ పంట నమోదు ముసాయిదా జాబితా పై గ్రామసభ

## మండల వ్యవసాయాధికారి బి. సంపత్ కుమార్

చంద్రశేఖరపురం అస్త్రం మార్చి 11: రబీ సీజన్ లో పంట సాగు చేసినటువంటి రైతులు అందరూ తప్పనిసరిగా రైతు సేవా కేంద్రం దగ్గరకు వెళ్లి పంట నమోదు ముసాయిదా జాబితాలో నమోదు చేసిన వివరములు సక్రమంగా ఉన్నాయా లేదో అని ఒకసారి వెరిఫై చేసుకొని ఏమైనా సరి చేయవలసి ఉంటే రైతు సేవా కేంద్ర సిబ్బందికి తెలియజేయవలసినదిగా మండల వ్యవసాయ అధికారి బి. సంపత్ కుమార్ తెలిపారు ఈరోజు చంద్రశేఖరపురం మండలంలోని బోయమడుగుల మరియు చంద్రశేఖరపురం రైతు సేవా కేంద్రాలలోని రబీ సీజన్లో సాగు చేసినటువంటి పంట నమోదు పై గ్రామ సభలో పాల్గొనడం జరిగింది గ్రామ సభలో మండల వ్యవసాయ అధికారి బి. సంపత్ కుమార్ మాట్లాడుతూ రబీ 2024 - 25 సీజనకు సంబంధించి పంట నమోదు లో భాగంగా వ్యవసాయ మరియు రెవిన్యూ శాఖ జాయింట్ అజమాయేషు మీద సాగు చేసినటువంటి ప్రతి పొలం దగ్గరకు వెళ్లి పంట నమోదు చేయడం జరిగిందని తెలిపారు పంట నమోదు పూర్తి చేసిన వెంటనే గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు రెవెన్యూ అధికారి తంబు వేసి ధ్రువీకరించిన తరువాత రైతులు వివరాలు ఒకసారి వెరిఫై చేసుకొని తంబు వేసి ధ్రువీకరించడం జరిగిందని తెలిపారు చంద్రశేఖరపురం మండలంలో మొత్తం 3465 ఎకరాలలో 1340 మంది రైతులకు పంట నమోదు చేశామని తెలిపారు మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో గ్రామ సభలు నిర్వహించి ఈ పంట నమోదు ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ కొరకు రైతు సేవా కేంద్రాలలో ప్రదర్శించడం జరుగుతుందని తెలిపారు రైతులందరూ ఆ జాబితా లో ఏవైనా చేర్పులు మార్పులు ఉన్నట్లయితే ఈనెల 18వ తేదీ లోపు సంబంధిత గ్రామ వ్యవసాయ




సహాయకులకు తెలిపినట్లైతే విచారించి సరి చేయడం జరుగుతుందని తెలిపారు అనంతరం గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ పంట నమోదు ముసాయిదా జాబితా మొత్తము చదివి వినిపించడం జరిగింది ముసాయిదా జాబితాను రైతు సేవా కేంద్రం దగ్గర కూడా ప్రదర్శించడం జరిగింది అనంతరం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి పావలి శ్రీనివాసులు గ్రామ వ్యవసాయ సహాయకులు పి. రవి శారదా పర్వీన్ బోయమడుగుల ఎంపిటిసి తిరుపతి రెడ్డి మరియు గ్రామంలోని రైతులు పాల్గొన్నారు

## ఎ. కొత్తపల్లిలో సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభం

దేవరాపల్లి, అస్త్రం ప్రతినిధి : మండలంలోని ఏ. కొత్తపల్లి గ్రామ పంచాయతీ సచివాలయం ప్రాంగణం, సంత బయలు స్థలం వద్ద వివిధ అభివృద్ధి పనులు నిమిత్తం మండల ప్రజా పరిషత్ 15 ఆర్థిక సంఘం నిధుల నుంచి మంజూరు చేసిన పనులను ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి, జడ్పీటీసీ కర్రి సత్యం చేతుల మీద ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, కార్యదర్శి ఉదయ భాస్కర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సతీష్, పప్పు సర్పంచ్ పాండూరి సర్వునాయుడు వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



## గిరిజన సమస్యలు పరిష్కారానికి కృషి

### టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు




దేవరాపల్లి, అస్త్రం ప్రతినిధి : గిరిజన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు అన్నారు. మండలంలోని చింతలపూడిపంచాయతీ శివారు గ్రామాలు బోడి గరువు,నేరళ్లపూడి తదితర గ్రామాల%అబ%తెలుగు దేశం పార్టీ ప్రధాన కార్యదర్శి బండారు. అప్పలనాయుడు, మండల టీడీపీ నాయకులు మంగళవారం సందర్శించి గిరిజనుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చింతలపూడి నుంచి బోడి గరువు, నేరళ్లపూడి రోడ్డు నిర్మాణం కోసం కృషి చేయాలని గిరిజనులు కోరారు. రేషన్ బియ్యం అందుబాటులోకి తీసుకు రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చిటిమరెడ్డి సూర్యనారాయణ, రైవాడ జలాశయం చైర్మన్ పోతల పాత్రు నాయుడు, చల్లా నానాజీ, రెడ్డి సురేష్, ముక్కు ఈశ్వరరావు, ముసలి పైడిరాజు, దొగ్గ దేముడు నాయుడు, సోమిరెడ్డి గోవింద తదితరులు పాల్గొన్నారు.

5
సామాన్యుడి ఆయుధం
అస్త్రం
T/AP/2024/0304/1072/41
ANDHRA PRADESH
prajalaastram999@gmail.com
విశాఖపట్నం | అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం 12 -3-2025

# ప్రభుత్వ స్థలాలు కబ్జాకు కేరాఫ్ చోడవరం ???

## ఎమ్మెల్యే,అధికారుల అండదండలతో యదేచ్ఛగా భూకబ్జాలు !!!??

## మండిపడుతున్న ప్రజా సంఘాలు ..చోద్యం చూస్తున్న అధికారులు!!!?





**చోడవరం : అస్త్రం ప్రతినిధి:** ప్రభుత్వ స్థలాలు కబ్జాకు కేరాఫ్ అడ్రస్ గా చోడవరం మారిందనే ఆరోపణ రాజ్యాంగ గత ప్రభుత్వ హయాంలో కబ్జాలు జోరుగా జరిగాయని కూటమి ప్రభుత్వం ఆరోపణలు చేస్తూ ప్రకటనలు ఇచ్చిన విషయం ప్రతి అందరికీ తెలిసిందే. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ ఆస్తులు కాపాడుతాం ప్రభుత్వ భూములు కబ్జా జరగకుండా చూస్తాం అంటూ పట్టణంలో కూటమి ప్రభుత్వం వచ్చింది ప్రభుత్వ భూములకు రక్షణ కలుగుతుందని ఈ ప్రాంతీయులు భావించారు. గత వైసిపి పాలనలో చోడవరం అప్పటి ఎమ్మెల్యే ధర్మ శ్రీ అక్రమణాలను తొలగించారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఆక్రమణలు జోరుగా జరుగుతున్నాయి అనే విమర్శలు లేకపోలేదు.స్థానిక తెలుగుదేశం ఎమ్మెల్యే, ప్రభుత్వ అధికారుల అండ దండలతో చోడవరం పట్టణంలో భూ కబ్జాలు యదేచ్ఛగా సాగుతున్నాయని బాహటంగా ఆరోపణలు గుప్పిస్తున్నారు. పట్టణంఏ విధంగానూ అభివృద్ధి చెందకపోయినను కబ్జాలకు కేరాఫ్ చోడ'వరం' గా ఎమ్మెల్యే, ప్రభుత్వ అధికారులు మార్చేస్తున్నారని స్థానికులు, ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించేందుకు, రోడ్డు విస్తరణ తో ప్రధాన రహదారుల్లో కబ్జాలను నివారించగలిగారు. కూటమి ప్రభుత్వం అందలం ఎక్కాక ఎమ్మెల్యే అండతో బి.ఎన్. రోడ్డులో కబ్జాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. దీనిపై ప్రశ్నించే నాథుడే కరువయ్యాడు. ఎమ్మెల్యే రాజు, ప్రభుత్వ అధికారులు కబ్జాలకు వంత పాడడంతో భూ ఆక్రమణదారులు యదేచ్ఛగా రోడ్లు, డ్రైనేజీలు వేటినీ వదలకుండా కబ్జాలు కొనసాగిస్తున్నారు. అధికారులకు, చోటా కూటమి నేతలకు డబ్బు కొట్టు స్థలం పట్టు అన్న చందంగా చోడవరం మారింది. పంచాయతీ స్థలాల్లోను, డ్రైనేజీలను అక్రమార్కులు ఆక్రమించుకుంటున్నారు. బి.ఎన్ రోడ్డులో తల్లి పిల్ల హాస్పిటల్ ఎదురుగా డ్రైనేజీ పైనే షాపు కట్టుకోమని అధికారులు చెప్పినట్టు షాప్ యజమానులు చెబుతున్నారు. చీడికాడ రోడ్లో పోలమాంబ గుడి గుడి పక్కన, చోడవరంలో పెద్ద వ్యాపారస్తుడు పంచాయతీ స్థలంలో ఎటువంటి అధికారిక అనుమతులు లేకపోయినా, షాపింగ్ కాంప్లెక్స్ కట్టుకోడానికి సిద్ధపడుతున్నారు. అధికారులకు తెలిసినను పట్టించుకోలేదని మహిళ, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇటీవలే శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు రోడ్లు విస్తరణ త్వరలో చేపడతామంటూ ప్రకటించడం, స్థానిక తెలుగుదేశం ఎమ్మెల్యే రాజు భూకబ్జాలకు తెర తీయడం దేనికి సంకేతమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అమాయకులను బలి చేసేందుకా, లేక వ్యాపారస్తుల నుండి డబ్బు దండుకునేందుకు ఎమ్మెల్యే, అధికారుల పన్నాగమా అని ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.



# కార్మికులు, కర్షకులను ప్రభుత్వమే ఆదుకోవాలి

### కార్మికులు, కర్షకుల కష్టాలకు బాసటగా వైసిపి

### శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ

**చోడవరం అస్త్రం ప్రతినిధి:** పీకల్లోతు కష్టాల్లో వున్న ది. చోడవరం కో ఆపరేటివ్ సుగర్స్ (గోవాడ) సభ్య రైతులు, కార్మికులు బకాయిలు చెల్లించి ప్రభుత్వమే ఆదుకోవాలని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. కార్మికులు కర్షకుల కష్టాల్లో బాసటగా నిలిచేందుకు ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో వైసిపి బృందం ఫ్యాక్టరీ యార్డుకు తరలి వచ్చారు. చోడవరం మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్, వైసిపి అనకాపల్లి పార్లమెంటరీ ఇన్చార్జి కరణం ధర్మశ్రీ అధ్యక్షతన గోవాడ ఫ్యాక్టరీ యార్డులో రైతులతో నిర్వహించిన సమావేశంలో బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ఏడాది క్రషింగ్ సీజన్ లోను, పాత బకాయిలు చెల్లింపునకు సభ్య రైతులు వివిధ దశల్లో చేస్తున్న పోరాటాలకు అండగా నిలుస్తామని తెలియజేశారు. సహకార రంగంలో ఎంతో ప్రతిష్ట కలిగిన గోవాడ సుగర్స్ ను కాపాడేందుకు కార్మికులు, చెరకు రైతుల బకాయిలు ఇచ్చేందుకు సుమారు రూ.84 కోట్ల మేర గ్రాంట్ రూపంలో తీసుకువచ్చామని గుర్తు చేశారు. కార్మికులు కర్షకుల బకాయిలు చెల్లించి, గోవాడ ఫ్యాక్టరీను అన్ని విధాలా ఆదుకుంటామన్న కూటమి నేతల వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఈ ఏడాది చెరకు క్రషింగ్ ప్రారంభించి నెలన్నర దాటుతున్నను, బకాయిలు, కార్మికులు, కర్షకుల కష్టాలపై పెదవి విప్పని చోడవరం, మాడుగుల ఎమ్మెల్యేలు రైతాంగానికి తక్షణమే సమాధానం ఇవ్వాలన్నారు. కార్మికుల కర్షకుల బకాయి చెల్లింపులకు ప్రభుత్వం తక్షణమే 35 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులను, కర్షకులను కూటమి ప్రభుత్వం ఆదుకోకపోతే నిరాహార దీక్షలకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు బూడి. ముత్యాల నాయుడు, గుడివాడ అమర్నాథ్, చోడవరం ఎంపీపీ గాడి కాశమ్మ , నర్సీపట్నం, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నం రెడ్డి అదీప్ రాజ్, చెరకు రైతులు, ప్రజా సంఘాలు, వైసిపి కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# వర్తక సంఘ సభ్యులు 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ..

రోలుగుంట అస్త్రం ప్రతినిధి : ఎల్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి విద్యార్థులకు స్థానిక అల్లూరి వర్తక సంఘం సభ్యులు రానున్న పరీక్షల నిమిత్తం పరీక్ష సామాగ్రి అందజేశారు.అనంతరం



పెద్దలు మాట్లాడుతూ విద్యార్థులకు 10వ తరగతి పరీక్షలు భావితరాల భవిష్యత్తుకు ఎంతో అవసరమని అన్నారు.విద్యార్థులు పరీక్షలు చక్కగా రాసి గ్రామానికి స్కూల్ కి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు.జిల్లా పరిషత్ స్కూల్ ప్రథమ,ద్వితీయ తృతీయ,స్థానాల్లో మార్కుల సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని శ్రీ అల్లూరి వర్తక సంఘం సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో రామచంద్రరావు, నానిబాబు,జోగు బాబు, జోగునాదం,రామకృష్ణ, చక్రి ,శివ ,లక్ష్మి,స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మృతి చెందిన ఫోటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సహాయం

జి మాడుగుల .అస్త్రం ప్రతినిధి : ఇటీవల అనారోగ్యం మృతి మృతి చెందిన జి మాడుగుల మండల సీనియర్ ఫోటోగ్రాఫర్ చిన్నబాబు దిన కార్యానికి జిల్లా యూనియన్ సభ్యులు అలాగే జిమాడుగుల మత్స్యమడుగులమ్మ యూనియన్ సభ్యులు చిన్న బాబు కుటుంబ సభ్యులు పరామర్శించి వారికి కొంత ఆర్థిక సాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా యూనియన్ ప్రెసిడెంట్ ఈశ్వరరావు, రామారావు, జి మాడుగుల యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



# ఎట్టకేలకు మోక్షం రక్షణ గోడల నిర్మాణం




**చోడవరం అస్త్రం ప్రతినిధి :** నాలుగు సంవత్సరాలుగా పోరాడుతున్న ఈ కల్వర్టుకి ఇప్పుడు మోక్షం కలిగింది. ఇరువైపులా రక్షణ కోడలు నిర్మించడానికి అధికారులు ముందుకు వచ్చారు.అనకాపల్లి జిల్లా చోడవరం మండలం లో చోటుచేసుకున్న సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా వున్నాయి.చోడవరం నుండి అనకాపల్లి వెళ్లే మార్గంలో వెంకన్న పాలెం చోడవరం మధ్యలో పూర్వం నిర్మించిన కల్వర్టు ఉంది.డబల్ రోడ్డు అయినప్పటికీ కల్వర్టు వెడాల్పు చేయలేదు.సరికదా మధుము ఇరుకుగామరడమే కాక రక్షణ గోడలు శిథిలమై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని.దీనిపై అధికారులు స్పందించక పోవడం తో ఓ ఉపాధ్యాయుడు సొంత నిధులతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి. అధికారులకు తెలిపిన స్పందించకపోవడంతో పత్రికలకు తెలపడంతో కథనాలు ప్రస్తుతం దీంతో అధికారులు నిద్ర మత్తు వదిలి మధుకు రక్షణ గోడలు నిర్మించే కార్యక్రమాన్ని చేపట్టారు.అయినా సరే ఇది తాత్కాలికమే రోడ్డు ఇంకా వెడల్పు చేయాల్సిన అవసరం ఉంది. ఈ మధుము చాలా ఇరుకుగా ఉంది. ఈ రక్షణ గోడలు కట్టినప్పటికీ మధుము ఇరుకుగా ఉందని ఇరువైపులా ప్రమాద బోర్డులు పెట్టకపోతే మరలా ఈ రక్షణ గోడలు పడిపోయే అవకాశం లేకపోలేదు. గతంలో ఉపాధ్యాయుడు పెట్టిన బోర్డులు తొలగించిన అధికారులు మధుముకు రక్షణ గోడలు నిర్మించి బోర్డులు పెట్టాల్సిన అవసరం ఉంది. లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. అధికారులు ఎప్పటికైనా ఈ మధమపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

# నేడు బి. కింతాడలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



దేవరాపల్లి, అస్త్రం ప్రతినిధి : మండలంలోని బోయిలకింతాడ గ్రామంలో ఈ నెల 12న వైఎస్సార్సీపీ అవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు తెలిపారు. ఈ వేడుకల్లో మాజీ డిప్యూటీ సిఎం, వైఎస్సార్సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు ముఖ్య అథితిగా పాల్గొంటారన్నారు. గ్రామంలోని దివంగత ముఖ్యమంత్రి డా. వైఎస్. రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పించి, వైఎస్సార్సీపీ జెండాను మాజీ డిప్యూటీ సిఎం బూడి ఆవిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్ లు, ఎంపీటీసీలు, వైఎస్సార్సీపీనాయుకులు, కార్యకర్తలు తరలిరావాలని బాబురావు కోరారు.

# కాశీపురంలో పది విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ

దేవరాపల్లి, అస్త్రం ప్రతినిధి : మండలంలోని కాశీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులు కొరుప్రోలు శ్రీను ఆధ్వర్యంలో టెన్త్ క్లాస్ విద్యార్థిని, విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని దారపురెడ్డి సన్యాసినాయుడు సహకారంతో అందించారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ఉపాధ్యక్షులు కొరుపోలు శ్రీను మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ఇష్టపడి చదివి పరీక్షల్లో మంచి మార్కులు సంపాదిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. దారపు రెడ్డి సన్యాసి నాయుడు మాట్లాడుతూ టెన్త్ క్లాస్ లో ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు మంచి మార్గంలో ముందుకు నడవాలని ప్రతి విద్యార్థినీ విద్యార్థులు సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు బాలత్రిపుర సుందరి , మండల కార్యదర్శులు రంది వెంకట్రావు, గంగావంశం సంతోష్, అజయ్ కుమార్ ఉపాధ్యాయ సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.





# పరిశీల గిర్లిగూడ మధ్య వంతెన నిర్మించాలి

### కలెక్టర్ స్పందించి గిరిజనుల సమస్య పరిష్కరించాలి.

డుంబ్రిగుడ :అస్త్రం ప్రతినిధి: చాలా గిరిజన గ్రామాలకు మట్టి రోడ్లు ఉన్నప్పటికీ వాగులు ఉండటం వల్ల వంతెనలు లేకపోవటం తో గ్రామాలకు ద్విచక్ర వాహనాలు 108 వంటి అత్యవసర వాహనాలు చేరుకోవటానికి అనువుగా లేకపోవడం తో వాగు అవతల వాహనాలు పెట్టి వాగు దాటి ఎందుకు అష్ట కష్టాలు పడుతున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలంలో పరిశీల గిర్లిగూడ మధ్యన ఉన్న వాగు పై వంతెన నిర్మాణం చేపట్టాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు రాకపోకలు అంతరాయం ఏర్పడుతుందని.గంటలపాటు ఉండి పోవాల్సిన పరిస్థితి నెలకొందని గిరిజనులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.అధికారులు స్పందించి వంతెనతో పాటు పరిశీల నుంచి గిర్లిగూడ వరకు రహదారి నిర్మాణం చేపట్టి తమ కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

సామాన్యుడి ఆయుధం
T/AP/2024/0304/1072/41
అస్త్రం
ANDHRA PRADESH
prajalaastram999@gmail.com
విశాఖపట్నం | అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం 12 -3-2025

# జైపూర్ జంక్షన్ ఎన్. హెచ్. ఫైవ్. డిజైన్ మార్చాలి?

**జోరుగా ప్రమాదాలు స్పందించిన అధికారులు**

**దిక్కులు నేమ్ ప్లేట్ బోర్డులు సూచికలు ఏర్పాటు చేయాలి!!!లి**

**ఎన్.హెచ్.ఫైవ్. గ్రామాలకు సోలార్ విద్యుత్ అమర్చాలి.**

**కలెక్టర్ ,ఎన్ .హెచ్ .ఫైవ్ అధికారులు తక్షణమేస్పందించాలి!!!**

**పాచి పెంట చిన్నస్వామి**



డుంబ్రిగుడ :అస్త్రం ప్రతినిధి: అల్లూరి సీతారామరాజు జిల్లా డంబ్రిగూడ మండలము అరుకు పంచాయతీ జైపూర్ జంక్షన్ ఎన్ .హెచ్ .ఫైవ్ రోడ్డు వద్ద తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని. దీనితో పాటు గ్రామ రోడ్లకు సోలార్ లైట్స్ లేవని దీనిని పరిశీలించిన ఏపీ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పాచి పెంట చిన్నస్వామి విలేకరులతోమాట్లాడుతూ అంతర్రాష్ట్ర ఆంధ్ర. ఒరిస్సా రాష్ట్రాల మూడు రోడ్ల కూడలి వద్ద సరైన దిక్సూచి లేకపోవడం, రోడ్డు ఎత్తు పల్లాలు ఉండడం వలన రెండు నెలల వ్యవధిలో పర్యటకులు స్థానికులు సుమారు 5 ద్విచక్ర .ఆటో. వాహనాలు ప్రమాదాలు సంభవించాయని, వాహనదారులకు కాళు . చేతులు. తలకు. దెబ్బలు తగిలి ఆసుపత్రిలో చేరుతున్నారన్నారు. దీని వలన చాలా ఇబ్బందికరంగా ఉంటుందని, ఈ దారి గుండా ప్రయాణికులు తికమక కంగారు పడవలసిన పరిస్థితి వస్తుందని దీని వలన పలు ప్రమాదాలు సంభవిస్తున్నాయని,ఈ మార్గంలో ప్రయాణిస్తున్న ప్రయాణికులు యువత ద్విచక్ర వాహనాలు ఈ ప్రదేశంలో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, దీనిని నివారించాల్సిన బాధ్యత అధికారులు రహదారుల నిర్మాణ గుత్తేదారుపై ఉందన్నారు. ప్రతి వాహనదారుడు మన అందరి బాధ్యతగా జాగ్రత్తగా నెమ్మదిగా రావాలని యువత ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ ధరించాలని ప్రమాదాలకు దూరంగా ఉండాలని కాంగ్రెస్ పార్టీ తరుపున కోరుతున్నామన్నారు.ఎన్ హెచ్ ఫైవ్ జైపూర్ జంక్షన్ డిజైన్ మార్చి ఎన్ హెచ్ ఫైవ్ అనుకొన్న గ్రామాలలో సోలార్ లైట్స్ అమర్చాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ కి ఎన్ హెచ్ ఫైవ్ అధికారులకు తక్షణమే సంబంధిత సౌకర్యాలు తక్షణమే కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర కోఆర్డినేటర్ తెల్లగంజి సోమేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బిల్లులు చెల్లించకపోతే గడ్డి తిని బతకాలా!

## ఉపాధి కూలీలు వినూత్న రీతిలో నిరసన



దేవరాపల్లి, అస్త్రం ప్రతినిధి : బిల్లులు చెల్లించకపోతే గడ్డి తిని బతకాలా! అంటూ మంగళవారం మండలంలోని దేవరాపల్లి, గరిసింగి, తెనుగుపూడి, డోర్రచేరువు, మారేపల్లి గ్రామాల్లో ఉపాధి కూలీలు నోట్లో గడ్డి పెట్టుకోని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. నాలుగు వారాలు నుండి ఎనిమిది వారాలు వరుకు బిల్లులు చేల్లించక పోవడంపై అగ్రహం వ్యక్తం చేశారు. సమ్మర్ అలవెన్సు, ప్లే షిప్స్, పెండింగ్ బాకాయిలు చెల్లింపులు వంటి డిమాండ్లు సాధన కోరకు ఈనెల 12 న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్వవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి. వెంకన్న, వ్వవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాద్యాక్షులు బిటి దోర పిలుపునిచ్చారు. అనంతరం కూలీలను ఉద్దేశించి వారు మాట్లాడారు. పెండింగ్ బకాయిలు, చేల్లింపులు,సమ్మర్ అల వెన్సులు, ప్లై సిపులు ఇవ్వక పోవడంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వ్యవసాయ కార్మికులు పనులు లేక, ఉపాధి పనులు లేక, ప్రతి రోజు వేలాది మంది ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వందలాది మంది సుదూర ప్రాంతాలకు నెలలు తరబడి వలసలు పోతున్నారని తెలిపారు. ప్రమాదంలో ప్రతి నిత్యం పదుల సంఖ్యలో కూలీలు చని పోతున్నారని అన్నారు. చదువులు కోల్పోయి, వారి పిల్లల భవిష్యత్తు మొగ్గలోనే తుంచి వేయబడుతుందని తెలిపారు. పేదల కోసం తెచ్చిన ఉపాధి హామీ చట్టం అమలు చేయడంలో చాలా లోపాలున్నాయని తెలిపారు. కుటుంబంలో ముగ్గురు, నలుగురు పని చేయడం వల్ల 100 రోజులు త్వరగా పూర్తి అవుతున్నాయని తెలిపారు. ఎండకాలంలో నేల గట్టిగా మారి కూలి గిట్టుబాటు కావడం లేదన్నారు. గతంలో ఇస్తున్న సౌకర్యాలన్ని ఆపే శారని తెలిపారు. ఉపాధిలో రాజకీయ జోక్యం పెరిగి కూలీలకు మస్టర్లు ఇవ్వకుండా రాజకీయ పార్టీ నాయకులకు మస్టర్లు ఇచ్చి పేదలతో డబ్బులు వసూలు చేసు కుంటున్నారని అన్నారు. పేదలకు వరంలాంటి ఉపాధి హామీ చట్టాన్ని అధికారులు, రాజకీయ నాయకులు కుమ్మక్కై చట్టం స్ఫూర్తిని నీరు గారుస్తున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. కాబట్టి ఈ క్రింది డిమాండ్ల పరిష్కారం కోసం ఉపాధి హామీ అమలు కోసం చట్టాన్ని ఆదర్శవంతమైన అమలుకై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ప్రభుత్వం దృష్టికి తీసుకు రావడానికి మార్చి 12 వ తేదీన విజయవాడలో పెద్ద ఎత్తున ఆందోళన జరుగుతుందని తెలిపారు. బకాయిలు చెల్లింపుకే చేపట్టిన ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వెంకన్న కోరారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కూలీలు పాల్గొన్నారు.

# గరిసింగి శివారు గ్రామాలకు విద్యుత్ సదుపాయం



దేవరాపల్లి, అస్త్రం ప్రతినిధి : మండలంలోని గరిసింగి గ్రామ పంచాయతీ శివారు గ్రామలైన పి.వి.జి.టి లకు మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ఆదేశాల మేరకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. స్థానిక విద్యుత్ శాఖ ఏఈ కర్రి శంకర రావు ఆధ్వర్యంలో మండల టీడీపీ కార్యదర్శి శరకాన సూర్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు గిరిజనులకు విద్యుత్తు సౌకర్యం కలిగిందన్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ ఏఈ శంకర్రావు తో పాటు ఆయా గ్రామాలను మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గూడుపు రాము, గొంతిన నరసింహనాయుడు ,కొట్టాడ నాగబాబు, కొట్టాడు అప్పలనాయుడు , గొంతిన అప్పలనాయుడు, గొంతిన రామకృష్ణ, దువ్వారా గంగరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు .

# వైభవంగా అభయాంజనేయ స్వామి తీర్థ మహోత్సవం

### రసవత్తరంగా గుర్రపు పరుగు పోటీలు






దేవరాపల్లి, అస్త్రం ప్రతినిధి : మండలంలోని వాకపల్లి గ్రామంలో శ్రీ అభయాంజనేయ స్వామి వారి తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. స్థానిక మాజీ ఎంపీటీసీ పెనగంటి సింహాచలం నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ తీర్థ మహోత్సవాల్లో భాగంగా గుర్రం పరుగు ప్రదర్శనతో పాటు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు అప్పలనాయుడు, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు , మండల టిడిపి అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం జరిగిన భారీ అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు స్వామివారి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. గుర్రం పరుగు ప్రదర్శనలో గెలుపొందిన విజేతలకు భారీ నగదు బహుమతులను అందజేశారు. మహిళల కోలాటం అందరిని ఆలరించింది. ఈ కార్యక్రమంలో రైవాడ ప్రాజెక్ట్ చైర్మన్ పోతల పాత్రు నాయుడు, దొగ్గ దేముడు నాయుడు, చల్లా నానాజీ, ఆవుగడ్డ కోటిపల్లి నాయుడు, మాజీ సర్పంచ్ బుదిరెడ్ల అప్పారావు, బండారు రామారావు తదితరులు పాల్గొన్నారు.

# జనసేన సైన్యంలో చేరుతున్న వైసీపీ శ్రేణులు!

**జనసేన పార్టీలో చేరిన అరకు నియోజకవర్గ నాయకులు.**

హుకుంపేట, అస్త్రం ప్రతినిధి : విశాఖలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎంఎస్ ఎంఈ చైర్మన్ శివశంకర్ సమక్షంలో హుకుంపేట మండలం,బాకూరు సెగ్మెంట్ వైసీపీ ఎంపీటీసీ సభ్యురాలు నైని రజని,యువజన విభాగం అధ్యక్షులు నైని సత్తిబాబు దంపతులు, అరకు వేలి మేజర్ పంచాయితీ మాజీ సర్పంచ్ సమర్ధి రఘునాధ్, బారాపల్లి మాజీ సర్పంచ్ తర్మాంగి జానకమ్మ, హుకుంపేట పెసా ఉపాధ్యక్షురాలు మజ్జి నాగమణిలతో పాటు ఏజెన్సీ ప్రాంతం నుండి 30 మంది జనసేన పార్టీలో చేరారు. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,జనసేన పార్టీ సిద్ధంతాలు నచ్చి పార్టీ లో చేరు తున్నట్లు వారు తెలిపారు.



# ఉపాధి హామీ పనులను ప్రజలు సద్వినియోగ పరచుకోవాలి



హుకుంపేట,అస్త్రం ప్రతినిధి : ఉపాధి హామీ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి, స్థానిక వార్డు సభ్యులు పాంగి మత్స్య కొండ బాబు అన్నారు, మంగళవారం "ఏం.జి.ఎన్.ఆర్.ఈజీఎస్" ఆధ్వర్యంలో మఠం పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రత్యేక గ్రామ సభలో అయన ముఖ్య అతిథిగాపాల్గొన్నారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ, కొండ పోడు పనులే కాకుండా వాణిజ్య పంటల పెంపకానికి కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద ప్రత్యేక నిధులు ఇస్తుందన్నారు, రోజు వేతనం 300 రూపాయలు కూటమి ప్రభుత్వం లబ్ది దారులకుఅందిస్తుందన్నారు,వచ్చే ఆర్థిక సంవత్సరం కొరకు నూతన పనులు కావాలను కునే ప్రజలు స్థానికి విఆర్పీ లకు దరఖాస్తు లు అందజేయాలనీ సూచించారు,సుమారు 70 లక్షల 6 వేల 24 రూపాయల కేంద్ర ప్రభుత్వ నిధులతో 2023 ఏప్రియల్ ఒకటి నుండి 2024 మార్చి 31 ఆర్థిక సంవత్సరానికి గాను,పంచాయతీ లోని 9 గ్రామాల్లో వివిధ రకాల పనులను లబ్ధిదారులకు కల్పించినట్లు ఏ.పీఓ లింగ మూర్తి తెలిపారు.డిఆర్పీ హిమ గిరి ఆధ్వర్యంలో ప్రత్యేక సామాజిక తనిఖీ బృందం 9 గ్రామాల్లో పర్యటించి అందుబాటులో వున్నా ప్రజలతో మాట్లాడి ఉపాధి హామీ పనుల పై సమగ్ర నివేదిక తయారు చేసారన్నారు, నివేదిక ను గ్రామ సభలో చదివి వినిపించారు, కొన్ని చిన్న చిన్న తప్పులు ఉన్నందున భవిష్యత్తు లో అలాంటివి జరగకుండా చూడాలని టెక్నికల్ అసిస్టెంట్, విఆర్పీ లకు సూచించారు,ప్రజలు ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం చేయక పోవటం తో గ్రామ సభ ను విజయవంతం గా నిర్వహించినట్లు అయన తెలిపారు,ఈ కార్యక్రమం లో పంచాయతీ కార్యదర్శి శివ కృష్ణ,డిఆర్పీ హిమగిరి, టీఏ మఠం చంద్రు పడల్, విఆర్పీ లు అల్లంగి బాలయ్య, కోటరీ మత్య లింగం,పీసా కమిటి ఉపాధ్యక్షులు అల్లంగి నారాయణ,మాజీ సర్పంచ్ తమర్భ భీమ్ బాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మోహిని, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే శిరీష జనరల్ నియోజకవర్గంలో మీకు సీటు ఇస్తారా:! ఆదివాసి పార్టీ



చింతపల్లి అస్త్రం ప్రతినిధి: ఎమ్మెల్యే శిరీష... జనరల్ నియోజకవర్గంలో మీకు సీటు ఇస్తారా,మిమ్మల్ని గెలిపిస్తారా అని భారత్ ఆదివాసి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవిని ఉద్దేశించి ప్రశ్నించారు.రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి మంగళవారం అసెంబ్లీ సమావేశాలలో మాట్లాడుతూ గిరిజనేతరులకు ఏజెన్సీలో గృహాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరడం దారుణమైన విషయం.గతంలో వైయస్సార్ కాంగ్రెసు పార్టీకి చెందిన ఏడుగురు ఆదివాసీ ఎమ్మెల్యేలు ఏజెన్సీలో గిరిజనేతరులు ఇళ్లు నిర్మించుకోవడానికి ఒకటిన్నర సెంట్ల భూమిని ఇవ్వాలని ముఖ్యమంత్రి కార్యాలయానికి లేఖ వ్రాసారు.మొన్నటికి మొన్న శాసనసభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు 1/70 చట్టాన్ని సవరించాలన్నారు.అయ్యన్న వ్యాఖ్యలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో ఏజెన్సీ బంద్ కు పిలుపునివ్వడం జరిగింది.గిరిజనేతరులు మాట్లాడితే ఆదివాసీలు వ్యతిరేకిస్తున్నారని,ఆదివాసీ ఎమ్మెల్యేలతో మాట్లాడిస్తున్నారని,భూబదాలయింపు నిషేధ చట్టాలైన 1/70,1/59 అని చెప్పడం కూడా ఎమ్మెల్యే శిరీషదేవికి చేతకావడం లేదు, గిరిజనేతరులు ఇచ్చిన ప్యాకేజీ తీసుకుని, వారిచ్చిన స్క్రిప్ట్ ను చదువుతున్నారంటేనే అమెకు ఆదివాసీ చట్టాలపైన కనీస అవగాహన లేదని అర్థం చేసుకోవాలని,భూబదాలయింపు నిషేధ చట్టం(ఎల్ టిఆర్ఏక్ట్) బ్రిటీష్ హయాంలో 1917 లోనే తీసుకొచ్చారని, 1959,1970 ముందు నుండే భూబదాలయింపు నిషేధచట్టం ఉందన్న విషయం తెలుసుకోవాలని,ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతంలో గిరిజనేతరులకు సూది మోపేంత స్థలం కూడా ప్రభుత్వం కేటాయించడానికి లేదు,అసలు ఐదో షెడ్యూల్డ్ ప్రాంతంలో ప్రభుత్వం కూడా నాన్ ట్రైబలే,ఇలాంటి ప్రజాప్రతినిధులు వల్లనే గిరిజనేతరులు ఐదవ షెడ్యూల్డ్ ప్రాంతాన్ని ఆక్రమించ్చికొంటున్నారని,ఎమ్మెల్యే శిరీషాదేవి తాను అసెంబ్లీలో మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేసారు.

7

సామాన్యుడి ఆయుధం

అస్త్రం

T/AP/2024/0304/1072/41

ANDHRA PRADESH

prajalaastram999@gmail.com

విశాఖపట్నం | అనకాపల్లి

అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం 12-3-2025

# బ్యాంకులో డబ్బులకై పాట్లు. వృద్ధులకు తప్పని డోలీ మోతలు

## అధికారులకు,పాలకులకు కానరాని గిరిజనుల కష్టాలు



అనంతగిరి,అస్త్రం ప్రతినిధి: అత్యవసర పరిస్థితులే కాదు వృద్ధులకు ఇతర ప్రాంతాలకు తరలించడం అంటే డోలీలు తప్పడం ప్రభుత్వాలు ఎన్ని మారినా ప్రజాప్రతినిధులు ఎంతమంది వచ్చినా గిరిజన గ్రామాల్లో వెతలు తప్పడం లేదు.అల్లూరి సీతారామరాజు జిల్లా,రొంపిల్లి పంచాయితీ కొండ శిఖరగ్రామమైనబూరిగ,చినుకోనిలపాటు ఎన్ ఆర్ పురం పంచాయతీ పరిధిలో చిముడు వలస, బొంగిజ, రాయపాడు, దేంజర్ పెద్దవలస,గిరిజన గ్రామాలుకు చెందిన వెయ్యి మంది జనాభా కలిగి ఉన్నారు.అక్కడ గిరిజనులు నిత్యం బ్యాంకు, సంతలకు,వైద్య సౌకర్యాల కోసం బూరుగు నుండి ఓనిజ మీదుగా విజయనగరం జిల్లా మెంటాడ మండల,కేంద్రంలో ఉన్న బ్యాంకులకు సంతల పని మీద వెళుతూ ఉంటారు. బూరిగ మల్లమ్మ(70) సోముల జోగయ్య(72)వీరు ఎనిమిది కిలోమీటర్లు నడవలేని పరిస్థితిలో డోలీ సహాయంతో నాలుగు కిలోమీటర్లు ఓనిజ వరకు అతికష్టం మీద తీసుకోని వెళ్లి అక్కడి నుండి ఆటోలో బ్యాంకు తీసుకువెళ్లారు. గతంలో ఉపాధి హామీ పథకం ద్వారారూ.3కోట్లతో 2024 జూలై నెలలో వనిజ నుండి బూరుగా చిన్న కోనల వరకు రోడ్డుకు నిధులు మంజూరు చేశారు.కానీ ఫారెస్ట్ అధికారులు అనుమతులు లేకపోవడంతో రోడ్డు మధ్యలో నిలిచిపోయింది. కలెక్టర్,పిఓ స్పందించి రోడ్డు నిధులు మంజూరు చేశారు కానీ(డిఎల్సి) డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ కమిటీ మీటింగ్ లో ఫారెస్ట్ అనుమతులు ఇవ్వడానికి ఫారెస్ట్ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో రోడ్డు పనులు మార్గమధ్యలో నిలిచిపోయాయి. నిరంతరం వైద్య సేవలు కోసం గజపతినగరం హాస్పిటల్ కి వెళుతూ ఉంటామని,పంచాయతీ కేంద్రానికి వెళ్లాలంటే ఈ విధంగా డోలీ కట్టుకొని ముసలోళ్ళందరూ తీసుకొని వెళ్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేసారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి మా రోడ్డుకు ఫారెస్ట్ అనుమతులు తక్షణమే మంజూరు చేయాలని సోముల అప్పలరాజు,బూరుగ పెంటయ్య ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేసారు.



## సారా నిర్మూలనకై ప్రజల్లో అవగాహన

దేవరాపల్లి, అస్త్రం ప్రతినిధి : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నవోదయ -2 కార్యక్రమంలో భాగంగా దేవరాపల్లి మండలంలోని తిమిరాం, తెనుగుపూడి, గరిసింగి, దేవరాపల్లి, ఏ. కొత్తపల్లి, రైవాడ, బీతపూడి, ఎం. అలమండ పరిసర గ్రామాలలో సారా నిర్మూలనకై మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సారా త్రాగడం వల్ల వచ్చే ఆరోగ్య సమస్యలు, దుష్పరిమాణాలు, సార్ నిర్మాణం కొరకు ప్రజల్లో అవగాహన కొరకు గ్రామాల్లో ప్రచార రథంపై ప్రొఫెషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్ చోడవరం వారి ద్వారా ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కలిగించారు.

## నేడు పాడేరులో ఫీజు పోరు

### కూటమి ప్రభుత్వం పై నిరసన గలం



కొయ్యూరు అస్త్రం ప్రతినిధి: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గ ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు అదేశాలు మెరకు బుధవారం పాడేరు నియోజకవర్గంలో కలేక్ట్రేట్ లో విద్యార్థుల కోసం విద్యార్థుల తల్లి దండ్రులతో కలిసి ఫీజు పోరు ర్యాలీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసిపి మండల అధ్యక్షులు అప్పారావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కొయ్యూరు మండల ఎంపిపి బుడుగు రమేష్, జెడ్పీటీసీ వార నూకరాజు, మండల పార్టీ అధ్యక్షుడు బిడిజన అప్పారావు,ప్రస్తుత ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు ,సర్పంచులు, నాయకులు,కార్యకర్తలు,అభిమానులు, పాల్గొని విజయవంతం చేయాలని వైసిపి మండల అధ్యక్షులు బిడిజన అప్పారావు కోరారు.

## రాష్ట్రంలో 125 కొత్త స్పెషల్ నీడ్స్ పాఠశాలలు

### అసెంబ్లీలో వెల్లడించిన మంత్రి లోకేశ్

రాష్ట్రంలో 125 కొత్త స్పెషల్ నీడ్స్ పాఠశాలలను ప్రతిపాదించామని శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేష్ వెల్లడించారు. స్పెషల్ నీడ్స్ పిల్లలు ఇంట్లో ఉన్నప్పుడు తల్లిదండ్రులు అనేక సమస్యలు ఎదుర్కొంటుంటారని.. వారి అవసరాలను ఆసరాగా తీసుకొని ప్రైవేటు సంస్థలు కొన్ని రూ.50 వేలు కూడా వసూలు చేస్తున్నాయని మంత్రి తెలిపారు. అంశాన్ని శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రస్తావించారు. స్పెషల్ నీడ్స్ పిల్లలకు టీచర్ అండ్ స్టూడెంట్ రేషియోను మెయింటైన్ చేయాలని.. అప్పుడే వారి కాళ్లపై వాళ్లను నిలబట్టడానికి అవకాశమేర్పడుతుందని ఎమ్మెల్యే తెలిపారు.దీనిపై మంత్రి లోకేష్ సమాధానమిస్తూ.. కేంద్ర ప్రభుత్వం రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఏర్పాటు చేసి, 21 రకాల దివ్యాంగుల్లో 9 రకాల వారికి స్పెషల్ ఎడ్యుకేషన్ ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. వీరి కోసం రాష్ట్రంలో 679 భవిత సెంటర్లు నిర్వహిస్తున్నామన్నారు.

# జనసేన పార్టీ లో అరకు వైసీపీ నుండి వలసలు



దుంబ్రిగుడ :అస్త్రం ప్రతినిధి : అల్లూరి జిల్లా అరుకు జనసేన పార్టీ అధ్యక్షులు,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తమ్మిరెడి శివసేంఖర్ జనసేన పార్టీ స్టేట్ మీడియా కోర్డినేటర్ విజయ్ వర్మ అధ్యక్షతన జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా రూరల్ సంయుక్త కార్యదర్శి బంగరు రామదాసు ఉమ్మడి విశాఖ జిల్లారూరల్ కార్యదర్శి కోన్నేడి లక్ష్మన్ రావు అద్వరం లో వైసీపీ నాయకులు రెబల్ ఎమ్మెల్యే అభ్యర్థి సమర్ది రఘునాథ్, నైన సత్తిబాబు, వాలా అనుచరులు 30 మంది వరకు జనసేన పార్టీ సిద్ధాంతాలు నచ్చి పార్టీ కండువా కప్పుకోన్నారు.ఈ కార్యక్రమము జనసేన పార్టీ బలోపేతానికి అరకు నియోజకవర్గం లో జనసేన పార్టీ బలపరిచే దిశగా జనసేన లో చేర్పించుకోవడం జరుగుతుందని, అదేవిధంగా ఆదివాసి గిరిజన ప్రాంతంలో ప్రత్యేకంగా జనసేన పార్టీ అధ్యక్షులు తీసుకుంటున్న చోరవతో ప్రతి గ్రామంలో మంచినీటి సౌకర్యము ప్రతి గ్రామానికి రోడ్ సౌకర్యము కల్పించుకునే విధంగా జనసేన పార్టీ లో ఉన్న చాలామంది సైనికులు కులాన్ని గాని మతాన్ని కించపరచకుండా వ్యక్తిగత దూషణలకు దిగకుండా మన ఆదివాసీ హక్కులను.ఆదివాసీ గిరిజన చట్టాలను గౌరవించి జనసేన పార్టీని బలోపేతం చేయడానికి ముందుకు వెళ్లాలని జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా రూరల్ సంయుక్త కార్యదర్శి బంగరు రామదాసు కొనేడి లక్ష్మన్ రావు ఉమ్మడి విశాఖ జిల్లా రూరల్ సంయుక్త కార్యదర్శి సూచించారు. అదేవిధంగా ఈ మార్చి 14 న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం గా జరుపుకుంటున్న పిఠాపురంలో ప్రతి ఒక్క జనసైనికుడు వాలంటరీగా తరలివచ్చి జనసేన పార్టీ అధ్యక్షులు12 వఆవిర్భావ సభాను విజయవంతం చేయాలని, అదేవిదంగా రానున్న రోజుల్లో మరికొంత మంది వైసీపీ నాయకులు కార్యకర్తలు కూడా జనసేన పార్టీ లో చేరటానికి సిద్ధంగా ఉన్నారని, జనసేన పార్టీ నాయకులు సైనికులు పార్టీ బలోపేతానకి దృష్టి ఉంచుకొని కలిసి పని చేయవలసినబాధ్యత మనపై వుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరాయి పంచాయితీ సర్పంచ్ పూజారి కోములు, దుంబ్రిగుడ మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షులు చిన్న రావు. కార్యదర్శి కిల్లో అర్జున్ పాల్గొన్నారు.